దిట్టకవి శ్యామలాదేవి

# ది ఫైనల్ డయాగ్నసిస్



సావిత్రికి అప్పుడే మెలకువ వచ్చింది. ఉలిక్కిపడి లేచి కూర్చుంది. అమ్మో! మూడయిపోయింది. అత్తయ్యకి టిఫిన్ చేయలేదు. పాలు వచ్చే *స: ఉంటాయి. తను తేలేదు. ఈ పాటికి పాలవాడు వెళ్ళిపోయే ఉంటాడు. ఇవాళ కాఫీలు ఇచ్చే దెలా? అయినా, తనకి ని ద్రప్పుడు పట్టిందో? వనంతా పూర్తి చేసుకొని కారేజి తీసుకెళ్ళే అప్పి వ స్తే దానికి కారేజి ఇచ్చింది. అత్తయ్య వక్కవీధిలో- ఉన్న బంధువు లింటికి వెళ్ళింది- 'ఇప్పుడే వస్తా' అని. తను తలుపేసుకొని

మంచంమీద వాలింది. అంతే! అంతవరకే తెలుసు. నిద్రెప్పుడు పట్టిందో! పనిమనిషి వచ్చి వెళ్ళిపోయి ఉంటుంది.

చీర సవరించుకొని లేచి నించుంది సావిత్రి. ఏమిటో ఇల్లంతా గిరగిరా తిరుగుతోంది. అమ్మో భూకంపమేమో! గబగబా బయటికెళ్ళాలి. తొందరగా నడవబోయింది. అడుగు ముందుకు పడలేదు కాని, మనిషి మాత్రం తూలి ముందుకు పడింది. తలుపు తగిలి, పైపెదవి చితికి రక్తం వచ్చింది. ఇది భూకంపం కాదు. తనకే ఏదో జబ్బు వచ్చింది. ఖర్మ-ఏ బి.పి.నో రాలేదు కదా? బి.పి. వస్తే తినేందుకు ఉండదు. అంతా పత్యమే. బి.పి. నేనా లేక ఇంకేదైనా పెద్ద జబ్బా? తనకు రోగమొస్తే చేసేదెవరు? సావిత్రి గుండె దడదడలాడింది. భయంతో వణికిపోయింది. లేచి నిలబడడానికి ప్రయత్నించి, మెల్లగా తలుపు పట్టుకుని నించుంది.

"సావిత్రీ! సావిత్రీ! ఎంత సేపు కొట్టాలి తలుపు. నీ బండనిద్ర పాడుగాను. పగలూ, రాత్రీ ఒకటే నిద్రా?" లక్ష్మీనరసమ్మ గొంతు మూడు వీథులకు వినిపించేంత గట్టిగా ఉంది.

"వస్తున్నా, వస్తున్నా నత్తయ్యా!" తనుకూడా గట్టిగా అరిచాననుకుంది సావిత్రి కాని, గొంతులోని మాట ఆమె చెవులదాకా కూడా రాలేదు. బలవంతాన ఓపిక కూడగట్టుకొని తలుపుతీసి అక్కడే ఉన్న కుర్చీలో కూలబడింది.

"ఏమే, ఏం నిద్దరే? నీ నిద్దర పాడుగాను. ఎంత సేపు బాదినా తలుపు తియ్యవేమిటి? ఇంతకీ దిబ్బరొట్టె వెయ్యమన్నాకదా వేశావా- రోజూ గోధుమరొట్టె తింటె వేడి చేస్తుందని" అంటూ వంటింట్లో గిన్నెలమీద మూతతీసి చూసింది. ఎక్కడా ఏం చేసినట్లుగా లేదు. అన్నీ తోమినవి తోమినట్లుగానే ఉన్నాయి. పోనీ కాఫీ అయినా ఉందా? బీరువాలో పాలుకూడా లేవు. లక్ష్మీనరసమ్మకి కోపం తారస్థాయికి చేరుకుంది. రయ్యిమని యుద్ధాని కొచ్చింది. సావిత్రి ముందు టేబుల్‌మీద తల వాల్చేసి పడుకునుంది. "ఇంకా తీరలేదుటే నీ నిద్దర?" ఆవిడ గొంతు ఖంగుమంది.

జవాబు చెప్పే ఓపిక లేదు. కళ్ళతోనైనా నీరసంగా ఉందని చెప్పాలనుకున్న సావిత్రి కళ్ళుకూడా తెరవలేకపోయింది. లక్ష్మీనరసమ్మ వచ్చి, "ఏమిటే! జ్వరంగా ఉందా?" అంటూ నుదుటిమీద చేయి వేసింది. సావిత్రి నిస్త్రాణగా మెడలు వాల్చేసింది. "అమ్మో, అమ్మో" అంటూ చుట్టుపక్కల వాళ్ళని పిలిచింది. అందరూ తలో సలహా చెప్పారు. ముఖంమీద చల్లటి నీళ్ళు చల్లి, మంచంమీద పడుకోబెట్టి ఫాన్ వేశారు. పక్కింటి వీణ డాక్టర్ అవ్వాలని ఇంటర్‌లో బై.పి.సి. గ్రూపు తీసుకుంది. ఇప్పణ్ణుంచే రోగులని ట్రీట్ చేయడం నేర్చుకోవాలని తహతహ. "గ్లూకోజ్ ఉందా, బామ్మగారూ?" అడిగింది.

తల అడ్డంగా ఊపింది లక్ష్మీనరసమ్మ. సావిత్రిని చూస్తూంటే ఆవిడకి భయంగా ఉంది. ఎంతో చలాకీ అయిన పిల్ల. ఇంటెడు చాకిరీ తనే చేస్తుంది. పనిమనిషిని పెట్టుకోమంటే పెట్టుకోదు. ఎప్పుడూ నవ్వుతూ, ఆడుతూ, పాడుతూ హుషారుగా ఉంటుంది. ఇలా ఎప్పుడూ లేదు. అసలు తలనొప్పి అనడంకూడా తను ఎరుగదు. తనే లోలోపల దిష్టి కొట్టేది... దీని కెంత ఆరోగ్యమో అని! ఇవాళ పాపం తోటకూరకాడలా వేళ్ళాడిపోయిందేమిటో? తండ్రీ భగవంతుడా! ఈ రోజుల్లో ఏవేవో వింత రోగాలొస్తున్నాయట. నా తల్లికి అలా ఏ రోగాలూ రాకుండా కాపాడు, నాయనా, ఏడుకొండలవాడా! సింహాచలం అప్పలకొండా" అంటూ పేరు పేరునా అందరు దేవుళ్ళనీ మొక్కుకోసాగింది.

"ఒరే బాబీ! మూర్తి డాక్టరుగారు ఈ పాటికి ఇంటికి వచ్చే ఉంటారు. సావిత్రి ఆంటీకి బాగాలేదని పిలుచుకురారా" అని పంపించింది ఎదురింటి గంగమ్మగారు.

"డాక్టర్ అంకుల్ అన్నం తింటున్నారు. తిన్న వెంటనే వస్తానన్నారు." బాబీ పగరుస్తూ వచ్చాడు.

"ఈలోగా వేడివేడి కాఫీ పడితే!" ఒక ఇల్లాలు.

సావిత్రి కళ్ళు తెరచి మళ్ళీ నీరసంగా కళ్ళు మూసుకొంది. "అయ్యో, పాలు తేలేదమ్మా బిడ్డ" అంది కళ్ళు ఒత్తుకుంటూ లక్ష్మీనరసమ్మ. ఇంతలోనే ఓ ముగ్గురు-కప్పులతో పాలు తీసుకువచ్చారు. లక్ష్మీనరసమ్మ కృతజ్ఞతగా చూసింది. అయిదు నిముషాలకి, "డాక్టర్ వచ్చారు, తప్పుకోండి." ఎవరో అన్నారు. అంతా అడ్డు తొలిగారు.

డాక్టరు సావిత్రిని పరిశీలించారు. "బి.పి., హార్ట్ బీట్ అంతా నార్మల్। జనరల్ వీక్నెస్. కంప్లీట్ రెస్టు కావాలి" అంటూ బి.కాంప్లెక్స్ ఇంజక్షన్ చేసి గ్లూకోజ్ పట్టించాడు. గంటలో నార్మల్ అయిపోతారు" అని చెప్పి వెళ్ళిపోయాడు.

ఆయన వెళ్ళిపోయిన కాస్సేపటికి స్కూల్ నుంచి బేబి, రాణీ వచ్చారు. "అమ్మా! పడుకున్నావేం ...మాకు టిఫిన్ పెట్టవా?" "ఆకలేస్తోంది, మమ్మీ!" బేబికి నాలుగేళ్ళు, రాణికి ఆరేళ్ళు. అయ్యో పిల్లలకి ఏంచేసి పెట్టలేదని సావిత్రికి కళ్ళవెంట నీళ్ళు వచ్చాయి. ఎందుకో కాళ్ళూ, చేతులూ కూడా కదల్చలేకపోతోంది. ఏదో ప్రమాదకరమైన జబ్బే. నేను కాస్తా చచ్చిపోతే ఈ పిల్లల్ని ఎవరు చూస్తారు? అత్తయ్య పెద్దవారు. వీళ్ళ అల్లరిని క్షణంకూడా భరించలేరు. ఆలోచిస్తూంటే సావిత్రికి చచ్చిపోతానేమో ననిపించింది. ముందు చిన్నగా చుక్కలుగా బయలుదేరిన ఏడుపు గుక్కలుగా మారింది. డొక్కలు ఎగ సెగసి పడ్డాయి. బేబి, రాణికూడా-"అమ్మా! భయం వేస్తోందమ్మా. ఏడవకమ్మా" అంటూ ఏడవసాగారు.

"సావిత్రీ! కాఫీ రెడీయేనా" అంటూ వచ్చిన సురేష్-ఇంట్లో పరిస్థితిని చూసి అవాక్కయిపో



